# భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

## కేంద్రకమిటీ

### పత్రికా ప్రకటన

**28-08-2014**

## సీనియర్ మావోయిస్టు నేత కామ్రేడ్ కోబాడ్ గాంధీపై వేధింపులను తక్షణమే నిలిపివేయాలి !

## సీనియర్ మావోయిస్టు రాజకీయ ఖైదీలందరినీ బేషరతుగా విడుదల చేయాలి !

సీనియర్ మావోయిస్టు కామ్రేడ్ కోబాడ్ గాంధీని 2009 సెప్టెంబర్ 17న ఢిల్లీ నగరంలో ఆంధ్రప్రదేశ్, ఢిల్లీ ఇంటెలిజెన్స్, పోలీసులు ఒక బహిరంగ ప్రదేశం నుండి ఎత్తుకుపోయి, మూడు రోజుల పాటు చట్టవిరుద్ధ కస్టడీలో ఉంచి ఇంటరాగేషన్ పేరుతో తీవ్ర మానసిక హింసకు గురి చేశారు. వివిధ పౌరహక్కుల, ప్రజాస్వామిక సంఘాల నుండి తీవ్రమైన నిరసనలూ, ఆందోళనలూ చేపట్టాకే సెప్టెంబర్ 21న కోర్టులో ప్రవేశపెట్టారు. అప్పటి కేంద్ర హోంమంత్రి చిదంబరం నిస్సిగ్గుగా ఆయనను 20న అరెస్టు చేసినట్టుగా, '24 గంటల్లోపే ఆయనను కోర్టులో ప్రవేశపెట్టినట్టు'గా పచ్చి అబద్ధాలు కూశాడు. అరెస్టు అయ్యాక ఆయనకు చాలా రోజుల వరకూ తన మందులను అందజేయడం గానీ, ఆయనకు ప్రాణహాని వున్నటువంటి జబ్బులున్నప్పటికీ వాటికి చికిత్స చేయించడం గానీ ఏదీ చేయకుండా రాజ్యం ఆయనను నిర్దాక్షిణ్యంగా వేధించింది.

కామ్రేడ్ కోబాడ్‌ను అరెస్టు చేసి ఇప్పటికి ఐదేండ్లు అవుతోంది గానీ ఆయనకు ఎటువంటి బెయిల్స్ ఇవ్వకుండా తప్పుడు కేసుల్లో ఇరికించి రాజ్యం ఆయన విడుదలను అడ్డుకుంటూ వస్తోంది. 70వ పడిలోకి ప్రవేశిస్తున్న ఆయనకు రక్తపోటు, గుండెజబ్బు, తీవ్రమైన ఇరిటబుల్ బవెల్ సిండ్రోమ్ (జీర్ణకోశ సంబంధిత వ్యాధి), సెర్వైకల్ స్పాండిలైటిస్, లుంబర్ స్పాండిలోసిస్, దీర్ఘకాల ప్రోస్టేట్ గ్రంధి వ్యాధి మొదలైన తీవ్రమైన శారీరక సమస్యలున్నాయి. ఆయన వయస్సు, శారీరక స్థితుల పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ, చట్టప్రకారం ఆయనకు అందాల్సిన కనీస సౌకర్యాలను కూడా కల్పించకుండా కేంద్ర, రాష్ట్ర ఇంటలిజెన్స్ అధికారులు, జైలు అధికారులు, న్యాయవ్యవస్థ ఆయనను వేధింపులకు గురి చేస్తున్నారు. ఇదంతా ఆయన ఆరోగ్యాన్ని దెబ్బతీయడానికే కుట్రపూరితంగా చేస్తున్నారు. తన సోదరి పంపే ఆరోగ్య సంబంధితమైన వస్తువులు గానీ, కుర్చీ, టేబుల్, మంచం, పుస్తకాలు, కలం, నోటుబుక్కులు వంటివి గానీ ఆయన ఎంతో పోరాడితే గానీ అందుబాటులోకి రాలేదు. ఇవి కూడా జైలు అధికారులు వెయ్యి కళ్లతో పరిశీలించే ఇస్తారు.

2013 ఫిబ్రవరిలో అఫ్జల్ గురుని రహస్యంగా ఉరి తీసేశాక (అసలు ఈ ఘటనే భారత న్యాయవ్యవస్థపై ఒక చెరిగిపోని మచ్చ) ఢిల్లీలోని తీహార్ కారాగారంలోని జైలు నెంబర్.3లోని హైరిస్క్ వార్డు నుండి ఖైదీలందరినీ వేరే జైలుకు తరలించారు. దాన్ని కామ్రేడ్ కోబాడ్ ఎంతో ప్రతిఘటించినప్పటికీ ఆయనను జైలు నెంబర్.1కు బలవంతంగా మార్చారు. అంతే కాదు, అలా తరలించేటప్పుడు కనీసమైన మానవత్వాన్ని కూడా ప్రదర్శించకుండా శారీరక సమస్యలున్న ముసలాయనతోనే ఆయన వస్తువులన్నిటినీ మోయించారు. దానితో అనేక వారాల పాటు ఆయన లేవలేని స్థితి ఏర్పడింది. ఆయనకు రోజువారీ పనులు చేసుకోవడం కష్టమవుతున్నప్పటికీ బకెట్లలో నీళ్లు మోసుకోవాల్సి రావడం, వంగుని బట్టలు ఉతుక్కోవడం వంటి పనుల్లో ఆయనకు సహాయకుల్ని కూడా కనీసంగా ఇవ్వకుండా తన అమానుషత్వాన్ని రుజువు చేసుకుంటున్నారు అధికారులు.

జైలును మార్చిన ప్రతిసారీ ఆయన తిరిగి రోజువారీ అవసరాలకు సంబంధించి అనేక విజ్ఞప్తులు చేసుకోవాల్సి రావడం, ఎన్నో రోజులకు గానీ ఒక్కొక్కటీ అందడం లేదా అసలు అందకపోవడం వంటి రూపాల్లో కూడా వేధింపులు కొనసాగుతున్నవి. తీహార్ జైలులోని సీనియర్ సిటిజన్ల వార్డుకు తనను తరలించమని ఆయన చేసుకున్న విజ్ఞప్తిని తిరస్కరించడమే కాక, మరోసారి మరొక జైలుకు పై విధంగా తరలిస్తే తాను ఇక తేరుకోవడం చాలా కష్టమని ఆయన ఎంతో స్పష్టంగా చెప్పినప్పటికీ మళ్లీ 2014 జులైలో ఆయనను జైలు నెంబర్.2కు తరలించ ప్రయత్నించారు. దాంతో ఆయన నిరాహార దీక్షకు కూర్చోక తప్పలేదు. ఆయనను బలవంతంగా జులై 16న జైలు నెంబర్.2కు స్ట్రెచర్‌పై తరలించారు.

సిపిఐ (మావోయిస్టు) పోలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సుశీల్ రాయ్ (బరున్‌దా) ఆరోగ్యం విషయంలో రాజ్యం దారుణమైన నిర్లక్ష్యం చూపడం వల్లే 2014 జూన్ 18న తీవ్ర అనారోగ్యంతో ఆయన మరణించిన నేపథ్యంలో కామ్రేడ్ కోబాడ్ పరిస్థితి ఆందోళనకరంగా ఉందనేది తేటతెల్లమే. 50, 60, 70వ పడిలో వున్న, తీవ్ర ఆరోగ్య సమస్యలు వున్న అనేకమంది సీనియర్ పార్టీ నేతల విషయంలో రాజ్యం ఇలాగే చాలా క్రూరంగా, అమానవీయంగా ప్రవర్తిస్తూ వారిని జైలులోనే త్వరగా చనిపోయేలా చేయడానికి కుట్ర పన్నుతోంది. సంవత్సరాల తరబడి వారిని

జైలులోనే మగ్గిపోయేలా చేస్తోంది. బెయిల్స్ రానీయడం లేదు, వచ్చినా వెంటనే కొత్త కేసులు పెట్టి వారిని జైలు గేటు బయటనే తిరిగి అరెస్టు చేసి లోపలకు తోస్తోంది. కామ్రేడ్స్ నారాయణ్ సన్యాల్, భూపేష్‌దా, పరేష్‌దా, సాహెబ్‌దా, చింతన్‌దా, షీలాదీదీ, అమిత్ బాగ్చీ ప్రమోద్ మిశ్రా, బచ్చా ప్రసాద్ సింగ్, చంద్రశేఖర్ రెడ్డి, ఎల్‌ఎస్ఎన్ మూర్తి, పతిత్ పావన్ హల్దార్, వారణాసి సుబ్రహ్మణ్యం వంటి ఎందరో సీనియర్ పార్టీ నేతలను వారి వృద్ధాప్యాన్ని, ఆరోగ్య సమస్యలను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకుండా వేధింపులకు గురి చేస్తున్నారు. జి ఎన్ సాయిబాబా వంటి మేధావులను కూడా 90 శాతం వికలాంగత వున్నప్పటికీ చట్టాలను తుంగలో తొక్కి ఎటువంటి సౌకర్యాలు ఇవ్వకుండా వేధిస్తున్నారు. ఇక సామాన్యులైన ఆదివాసులు, దళితులు, మహిళలు వేలాదిగా నేడు దేశంలోని డజన్ల కొద్దీ జైళ్లలో ఎటువంటి సౌకర్యాలు, సహాయం లేక, పోలీసు–జైలు అధికారుల దౌర్జన్యానికీ, న్యాయవ్యవస్థ అన్యాయాలకూ బలైపోతూ ఏండ్ల తరబడి మగ్గిపోతున్నారు. కొందరు అక్కడే తుదిశ్వాస విడుస్తున్నారు.

ఇప్పుడిక మోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఆధ్వర్యంలో న్యాయవ్యవస్థ నరహంతకులైన అమిత్‌షా వంటి వారికి క్లీన్‌చిట్‌లు ఇస్తూ, వారికి జెడ్ ప్లస్ సెక్యూరిటీలు కల్పిస్తూ వారి అకృత్యాలన్నిటికీ న్యాయసమ్మతిని సృష్టిస్తోంది. రాజకీయ ఖైదీల విషయంలో గానీ, సామాన్య ఖైదీల విషయంలో గానీ ఎస్కార్ట్ లేదనే కుంటిసాకులతో, నామమాత్రమైన కేసులను కూడా ఏండ్ల తరబడి సాగలాగుతూ వారిని వేధిస్తోంది. ఖైదీలకు న్యాయంగా దక్కాల్సిన ఎటువంటి సౌకర్యాలను కల్పించడం లేదు. కక్షపూరితంగా వ్యవహరిస్తోంది.

కామ్రేడ్ కోబాడ్ గాంధీని ప్రత్యేకంగా టార్గెట్ చేసి జైలు అధికారుల ద్వారా రాజ్యం చేస్తున్న వేధింపులను తక్షణం నిలుపుచేయాలనీ, ఆయనను బేషరతుగా తక్షణం విడుదల చేయాలని అన్ని విప్లవ, ప్రజాస్వామిక, పౌరహక్కుల సంస్థలనూ, శక్తులనూ, న్యాయవాదులనూ సమైక్యంగా, దృఢంగా పోరాడాల్సిందిగా సిపిఐ (మావోయిస్టు) కేంద్రకమిటీ విజ్ఞప్తి చేస్తున్నది. ఆయన వలెనే ఏండ్ల తరబడి జైళ్లలో మగ్గిపోతున్న పైన పేర్కొన్న సీనియర్ పార్టీ నేతలందరి విడుదల కోసం, వారందరికీ రాజకీయ ఖైదీలుగా గుర్తింపునివ్వడం కోసం ప్రజలందరినీ ప్రజాందోళనలు కొనసాగించాల్సిందిగా, ప్రభుత్వాలపై, న్యాయవ్యవస్థపై తీవ్రమైన ఒత్తిడి తేవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నది.

Abhay

**అభయ్,**

**అధికార ప్రతినిధి, కేంద్ర కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**